నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి


I | హైదరాబాద్, సోమవారం 26 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI


## 2 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

మధ్యాహ్నానికి క్లోజ్



హాలియా, ఆగస్టు 25 : నాగార్జున సాగర్ జలాశయం నుంచి ఆదివారం ఉదయం 2 క్రస్ట్ గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని ఎన్ఎస్‌పీ అధికారులు దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో గేట్లు మూసి వేశారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్‌కు వరద వస్తుండగా.. అంతే మొత్తంలో బయటకు వదులుతున్నారు. సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో 590 అడుగులు (312.0450 టీఎంసీలు) నీరు ఉంది. కుడి కాల్వకు 9,047 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,367, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,151, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 48,965 క్యూసెక్కులు వస్తుండగా.. అవుట్ ఫ్లో 48,966 క్యూసెక్కులు ఉంది. ఈ నెలలో ఇప్పటి వరకు నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా 140 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.



రాజాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి

# ట్రిపుల్ ఆర్ జంక్షన్‌పై వర్రీ

## మొదటి డిజైన్ మార్చిన సర్కారు


**రీజనల్ రింగ్ రోడ్డు పనుల్లో ప్రభుత్వం వేగం పెంచింది. ఇందులో భాగంగా చౌటుప్పల్ పట్టణ సమీపంలో జంక్షన్ ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఇందు కోసం గతంలో 78ఎకరాలు ప్రతిపాదించగా.. రెండోసారి డిజైన్ మార్చి 181 ఎకరాలకు పెంచారు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి డిజైన్ ప్రకారమే భూములు తీసుకోవాలని, భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.**

– చౌటుప్పల్, ఆగస్టు 25

### 78 ఎకరాల నుంచి 181 ఎకరాలకు పెంపు

### భూములు కోల్పోతున్న రైతుల్లో ఆందోళన

రీజినల్ రింగ్ రోడ్డు పనుల్లో భాగంగా ఇప్పటికే చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో రైతుల అవార్డు ఎంక్వైరీ పూర్తయింది. నోటిఫికేషన్ విడుదల చేసి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. చౌటుప్పల్ జంక్షన్‌కు సంబంధించి భూ సేకరణ పెగ్ మార్కింగ్ కూడా పూర్తయింది. మరో మూడ్రోజుల్లో సంబంధిత సర్వే నంబర్లు కూడా ఇవ్వనున్నారు. కాగా, గతంలో జంక్షన్‌కు 78 ఎకరాలు ప్రతిపాదించగా.. రెండోసారి డిజైన్ మార్చి 181 ఎకరాలు అవసరమని నిర్ణయించారు. ఈ మేరకు చౌటుప్పల్‌లో 163 ఎకరాలు, తంగడపల్లిలో 16, లింగోజిగూడెంలో 2ఎకరాలు సేకరించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, డిజైన్ మార్పుతో పలువురు రైతులు తమ భూములను కోల్పోవాల్సి వస్తున్నది. ఈ నిర్ణయంతో గతంకన్నా 103 ఎకరాల వ్యవసాయ భూములతోపాటు 300 మంది ఇండ్ల స్థలాలు కోల్పోతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ట్రిపుల్ ఆర్ జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం 65వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.




చౌటుప్పల్ డబుల్ డంబెల్ జంక్షన్ ప్రాంతం

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..

హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణ శివారులో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డబుల్ డంబెల్ ఆకారంలో భారీ జంక్షన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న వాటి కన్నా భిన్నంగా ఏర్పాటు చేయనున్నారు. అమెరికాలో ఓ ప్రాంతంలోని జంక్షన్ నిర్మాణం మాదిరిగా చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. గతంలో ఓఆర్ఆర్ విషయంలో సేకరించిన కొంత భూమి ఇప్పటికీ రహదారి వెంట నిరుపయోగంగా ఉంది. అటు రైతులకు, ఇటు ప్రభుత్వ అవసరాలకు అక్కరకు రాకుండా ఉన్నది. దానిని అధిగమించేందుకు ప్రస్తుతం అవసరాలకు తగ్గట్టు ట్రిపుల్ ఆర్‌కు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా భూమి సేకరణ తగ్గదలతోపాటు పరిహార ఖర్చులు సైతం తగ్గనున్నాయి. సర్వీసు రోడ్లు లేకుండా 10మీటర్ల ఎత్తులో రహదారి రానున్నట్లు బయటకు వినిపిస్తుంది. దీనికితోడు సేకరించిన భూమి నిరుపయోగం కాకుండా జంక్షన్ వద్ద వాహనదారులకు, ప్రయాణికుల కోసం బహుళ అంతస్తుల హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, మల్టీప్లెక్స్‌లు, పార్కులు, విశ్రాంతి భవనాలు, పార్కింగ్ స్థలాలు నిర్మించనున్నారు.

#### పూర్తిగా భూమి కోల్పోతున్నం

మా నాన్న పేరు మీద 12 ఎకరాల భూమి ఉంది. మేము ముగ్గురం అన్నదమ్ముళ్లం. వారసత్వంగా వచ్చిన భూమిని నమ్ముకొని అందరం వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నం. జంక్షన్ నిర్మాణంలో పూర్తిగా భూమి కోల్పోతున్నం. మాకు భూమికి బదులు భూమి ఇవ్వాలి.

**- జాల జంగయ్య యాదవ్, రైతు, తంగడపల్లి**



#### మార్కెట్ ధర చెల్లించాలి

నా చిన్నతనం నుంచి వ్యవసాయమే మాకు జీవనాధారం. నాకున్న 7ఎకరాల్లో 5ఎకరాల భూమి జంక్షన్‌కు పోతుంది. మిగిలిన రెండు ఎకరాలు దేనికీ పనికి రాకుండా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం ఎందుకూ సరిపోదు. వేరే దగ్గరికిపోతే గంటెడు భూమి కూడా రాదు. బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలి. లేకుంటే మా బతుకులు ఆగం అవుతాయి.

**- గుండెబోయిన గాలయ్య యాదవ్, రైతు, తంగడపల్లి**



#### పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

పాత అలైన్‌మెంట్ ప్రకారం జంక్షన్ నిర్మించాలి. రెండోసారి ఇచ్చిన మార్కింగ్‌తో ఇబ్బంది పెరిగింది. మా దగ్గర గతంలో 4గుంటల భూమి పోతే.. ఇప్పుడు 7ఎకరాలు పోతుంది. చౌటుప్పల్ పట్టణంలో భూమి కూడా లేదు. ఉన్న కొంచెం భూమిని జంక్షన్‌కు తీసుకుంటే తాతలు, తరాల నుంచి వచ్చిన భూమి ఆనవాళ్లు లేకుండా పోతోతుంది. పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి.

**- చింతల సుధాకర్‌రెడ్డి, రైతు, చౌటుప్పల్**



# మల్లన్నసాగర్ నీళ్లతో ఆలేరును సస్యశ్యామలం చేయాలి

- **దేవుళ్ల మీద ప్రమాణం చేసిన ప్రకారం వందశాతం రుణమాఫీ చేయాలి**
- **కాంగ్రెస్‌తోనే కరువు వచ్చిందని రైతుల ఆవేదన**
- **సాగు జలాలపై పాలకులకు కనీస అవగాహన లేదు**
- **ఆరు గ్యారెంటీల అమలు కోసం పోరాటం చేస్తాం**
- **మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి**

రాజాపేట, ఆగస్టు 25 : మాజీ సీఎం కేసీఆర్ అపర భగీరథడిలా నిర్మించిన మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ ద్వారా గొలుసుకట్టు చెరువులు నింపి ఆలేరు నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేయాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో నోటికి ఏది వస్తే అది చెప్పి అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలో వచ్చిందన్నారు. ఎనిమిది నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో పుష్కలంగా జలవనరులున్నప్పటికీ రైతులకు సాగు నీళ్లు అందించాలనే సోయి కూడా ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. మల్లన్న సాగర్ నీటితో గంధమల్ల చెరువు నింపితే చాలు రాజాపేట మండల ప్రాంతంలో భూగర్భ జలాలు అమాంతం పెరుగుతాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టిన ప్రాజెక్ట్‌లతో సాగు నీళ్లను ఎలా వినియోగించుకోవాలో ఇక్కడి పాలకులకు కనీస అవగాహన లేకపోవడం విడ్డూరంగా విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ ద్వారా రాజాపేట ప్రాంతానికి సాగు జాలాలు అందించాలనే గొప్ప సంకల్పంతో గొలుసుకట్టు చెరువులు నింపేందుకు భూసేకరణ చేపట్టి 19 కిలోమీటర్ల వరకు కాల్వల తవ్వకాల కోసం నిధులు సైతం మంజూరు చేశామని, 8 కిలోమీటర్ల మేర కాల్వ తవ్వకాలు చేపట్టామని గుర్తు చేశారు. మిగతా కాల్వ పనులను పూర్తి చేసి చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. వంద మంది రైతుల్లో ముప్పై మందికి రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత మాటలు చెప్పుతున్నారన్నారు. కాంగ్రెస్ వచ్చింది రాష్ట్రంలో కరువు తెచ్చిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బెడిదే వీరేశం, మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్, నాయకులు మాటిసెటి సత్యనారాయణ, గిరిరాజు వెంకటయ్య, బిల్లకుదురు రాజు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మూసీ నీటి విడుదల



కేతేపల్లి, ఆగస్టు 25 : మూసీ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా ఆదివారం నీటి విడుదల కొనసాగింది. ప్రాజెక్టు 2, 7వ నెంబరు క్రస్టు గేట్లను ఒక్కో అడుగు మేర ఎత్తి 1290.26 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 119.70 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 215.46 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 1685.64 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 1087.14 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం 643.40 (4.04 టీఎంసీలు) అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



భువనగిరిలో టెన్నిస్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్

# ఉత్సాహంగా అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు

- **భువనగిరి వేదికగా అండర్ 18 టెన్నిస్ స్పోర్ట్స్**
- **ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**
- **170 మంది పైగా టెన్నిస్ క్రీడాకారుల భాగస్వామ్యం**
- **వారం పాటు కొనసాగనున్న పోటీలు**

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ టెన్నిస్ పోటీలకు భువనగిరి వేదికైంది. జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో ఆదివారం అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాజనర్సింహారావు మెమోరియల్ ఐటీఎఫ్ వరల్డ్ జూనియర్స్ టూర్ అండర్ –18 టోర్నమెంట్‌కు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆస్ట్రేలియా, కెనడా, యూఎస్, ఇండియాలోని వివిధ రాష్ట్రాల చెందిన 170 మంది టెన్నిస్ క్రీడాకారులు టోర్నమెంట్లో పాల్గొనడానికి వచ్చారు. సోమవారం నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. బాలికలు, బాలుర విభాగాల్లో వారంపాటు పోటీలు జరుగనున్నాయి. ఈ నెల 30న ఫైనల్స్ నిర్వహించనున్నారు.

### స్పోర్ట్స్ హబ్‌గా భువనగిరి : కుంభం

భువనగిరికి మహర్దశ పట్టుకుందని, త్వరలో స్పోర్ట్స్ హబ్‌గా మారనుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పటికే రాయగిరిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని అని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో న్యూ డైమన్షన్ టెన్నిస్ అకాడమీలో 8 టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. త్వరలో ఇక్కడ 3 స్టార్ హోటల్ ఏర్పాటు చేయనుండటం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ సభ్యుడు, తెలంగాణ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ పులిమామిడి సుభాశ్ రెడ్డి, కేఆర్ రమన్, నారాయణదాసు, వెంకటరెడ్డి, శివారెడ్డి, సందీప్ రెడ్డి, శివాని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బోనం.. ఘనం



భూదాన్ పోచంపల్లిలో మద్దెలమ్మ ఆలయానికి తరలివెళ్తున్న పద్మశాలీలు

**జిల్లాలో పలుచోట్ల ఆదివారం బోనాల పండుగను నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మోటకొండూరు, భువనగిరి, వలిగొండ, రాజాపేట, యాదగిరి గుట్ట మండలంలోని వంగపల్లిలో జరిగిన బోనాలతో స్థానికంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.**



మోటకొండూర్ మండల కేంద్రంలో గ్రామదేవతల ఆలయాలకు డప్పు చప్పుళ్లతో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు.

# కాన్పుకొస్తే కష్టాలే!

## జిల్లా కేంద్ర దవాఖానలో మరో ఘటన.. ప్రసవంలోనే శిశువు మృతి

- **కుర్చీలో గర్భిణి ప్రసవం జరిగిన సంఘటన మరువక ముందే ఇంకో దారుణం**
- **అందుబాటులో లేని వైద్యులు.. నర్సులతో నామమాత్రంగా చికిత్స**
- **డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని బాధితుల ఆందోళన**



నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో శిశువు మృతిపై పోలీసుల విచారణ

రామగిరి, ఆగస్టు 25 : నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో వైద్యుల నిర్లక్ష్యంతో ప్రసవానికి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండ్రోజులుగా చోటు చేసుకుంటున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గురువారం దేవరకొండ ప్రాంతం నుంచి ప్రసవానికి వచ్చిన మహిళకు సకాలంలో చికిత్స చేయకపోవడంతో కుర్చీలోనే ప్రసవం జరిగిన విషయం విదితమే. ఈ విషయంలో జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దాంతో శనివారం డాక్టర్లు మూకుమ్మడిగా సామూహిక సెలవులు పెట్టడంతో వైద్య సేవలు కొనసాగలేదు. ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానకు మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి శ్రీలతను మూడో కాన్పు కోసం జిల్లా కేంద్ర దవాఖానలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి శుక్రవారం సాయంత్రం ఆమె కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. అయితే.. వైద్యులు వచ్చి పరిశీలించలేదు. నర్సులు మాత్రమే వచ్చి డాక్టర్లు రేపు ఉదయం 10గంటలకు వస్తారని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. శనివారం వైద్యులు, సిబ్బందిలో చాలా మంది మూకుమ్మడిగా సెలవులు పెట్టారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేయకపోవడంతో శనివారం సాయంత్రం 6గంటల సమయంలో ప్రైవేట్ ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లేందుకు బాధితురాలి బంధువులు ప్రయత్నిస్తుండగా.. సిబ్బంది, డ్యూటీ డాక్టర్ స్వరూపారాణి అడ్డం తిరిగి ఆపరేషన్ చేస్తామని లోపలికి తీసుకెళ్లారు. ఆమెకు స్కాన్ చేసి తల్లీబిడ్డ బాగానే ఉన్నారు.. ఆందోళన అవసరం లేదని చెప్పారు. ఆ వెంటనే మరో డాక్టర్‌కు ఫోన్ చేయగా వచ్చారు. ఆయనతో కలిసి హడావుడిగా రాత్రి 8గంటల సమయంలో ఆపరేషన్ చేయించారు. కానీ.. గర్భంలోనే మగ శిశువు మృతిచెందింది. డాక్టర్లు ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతిచెందిందని బాధితులు ఆరోపిస్తున్నారు. శిశువు ఒంటిపై అక్కడక్కడ గాయాలు ఉండడంతో వైద్యురాలితో గొడవకు దిగారు. రాత్రి నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు.

#### ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది స్పందించలేదు

నా భార్య శ్రీలతను ప్రసవం కోసం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చాం. డాక్టర్లు లేరు.. రేపు ఉదయం 10గంటలకు వస్తారని అక్కడున్న నర్సులు చెప్పారు. ఎలాంటి వైద్యం చేయలేదు. శ్రీలత ఇబ్బంది పడుతుండటంతో గ్లూకోజు మాత్రం పెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరూ రాకపోవడంతో సాయంత్రం 6గంటలకు ప్రైవేట్ ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్తుండగా.. డాక్టర్, నర్సులు అడ్డం తిరిగి మా ఉద్యోగాలు పోతాయి.. ఇక్కడి నుంచి ఎలా తీసుకెళ్తారు అంటూ అడ్డగించారు. మరో డాక్టర్‌కు ఫోన్ చేయడంతో ఉదయం నుంచి రాని డాక్టర్ ఐదు నిమిషాల్లో వచ్చి ఆపరేషన్ చేస్తామని చెప్పారు. రాత్రి బలవంతంగా డాక్టర్లు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి డ్రస్ వేసుకుని బయటకు వచ్చి టెన్షన్ టెన్షన్‌గా ఫోన్ మాట్లాడి.. గర్భంలో పాపకు ఎఫెక్ట్ అయిందన్నారు. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లే ముందు పెద్ద ప్రాణానికి, చిన్న ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. డాక్టర్లు వెంటనే స్పందించకపోవడంతోనే ఇలా జరిగింది. శిశువు ఒంటిపై అక్కడక్కడ చిన్న చిన్న గాయాలున్నాయి. దీనిపై విచారణ చేసి మాకు న్యాయం చేయాలి.

**- రాజు, శ్రీలత భర్త**